సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



ధనుర్మాస ఉత్సవాలకు సన్నద్ధం

ధనుర్మాసం ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. వైష్ణవాలయాలలో నెల రోజుల పాటు తిరుప్పావై ప్రవచనాలు చెబుతారు.

- 8లో



చేనేతకు సహకారం

చేనేత పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పొందూరులో నిర్మించిన ఖాదీ భవన సముదాయాన్ని ఆయన ప్రారంభించారు.

- 8లో

నేడు డయల్ యువర్ డీఎం

శ్రీకాకుళం క్రైమ్ : ఏపీఎస్ఆర్టీసీ బస్సులకు సంబంధించి సలహాలు, సూచనలకు ఆదివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఒక ప్రకటన విడుదల చేశారు. డిపో-1 పరిధిలోని శ్రీకాకుళం, గార, ఎచ్చెర్ల, పొందూరు, రాజాం మండలాల ప్రయాణికులు 9959225608 నంబరుకు ఫోన్ చేసి సూచనలివ్వాలని కోరారు.

న్యూస్‌రీల్

గణతంత్ర పరేడ్‌కు వర్సిటీ విద్యార్థి



విద్యార్థినిని అభినందిస్తున్న వీసీ, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జనవరి 26న నిర్వహించే గణతంత్ర పరేడ్‌లో పాల్గొనేందుకు ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం విద్యార్థికి ఆహ్వానం అందింది. ఇక్కడి ఏపీజే అబ్దుల్ కాలం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చివరి ఏడాది చదువుతున్న బమ్మిడి రంజిని జాతీయ సేవాపథకంలో కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఎంపికైంది. ఈ నెల 29న ఢిల్లీ వెళ్లి ప్రత్యేక శిక్షణ తీసుకొని పరేడ్‌లో పాల్గొంటుంది. ఆంధ్రప్రదేశ్ నుంచి 10 మంది ఎంపిక కాగా అందులో రంజిని ఒకరు. ఈ సందర్భంగా విద్యార్థిని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.అనురాధ శనివారం అభినందించారు.

గరిమెళ్ల పేరిట పోస్టల్ కవర్



మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్

శ్రీకాకుళం: భారత ప్రభుత్వం-తపాలాశాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలో ఈ నెల 18న గరిమెళ్ల సత్యనారాయణ పేరిట ప్రత్యేక పోస్టల్ కవర్ విడుదల చేయనున్నట్టు తపాలాశాఖ సూపరింటెండెంట్ పిల్ల శ్రావణ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాటి స్వాతంత్ర్య ఉద్యమంలో గరిమెళ్ల 'మాకొద్దీ తెల్లదొరతనం' అనే పాటతో ఉత్తేజం రగిలించారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో గరిమెళ్ల స్వగ్రామం ప్రియాగ్రహారంలో పోస్టల్ కవర్ విడుదల చేస్తామని చెప్పారు. జిల్లా ప్రజాప్రతినిధులు, పోస్టల్ ఉన్నతాధికారులు, గరిమెళ్ల కుటుంబ సభ్యులు హాజరవుతారని తెలిపారు.

ఎలుగుబంట్ల బీభత్సం



లక్ష్మీపురంలో కొబ్బరిచెట్టు కింద పగిలిన కాయలు

మందస/కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతంలోని కొబ్బరితోటల్లో ఎలుగుబంట్లు బీభత్సం సృష్టిస్తున్నాయి. మందస మండలం మండలం బేతాళపురం పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో శుక్రవారం రాత్రి జుత్తు దానేష తోటలో కొబ్బరికాయలు తెంచేసి నాశనం చేశాయి. రెండు ఎలుగుబంట్లు ప్రవేశించి కొబ్బరిచెట్టు ఎక్కి కాయలను తినేస్తున్నాయని స్థానిక రైతులు చెబుతున్నారు. పలాస మండలం మాకన్నపల్లిలో నెలకిందట మూడు ఎలుగుబంట్లు హల్‌చల్ చేయడంతో భయాందోళనకు గురయ్యారు. మళ్లీ ఎలుగులు రావడంతో భయాందోళనగా ఉంటోందని, అటవీ అధికారులు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

21, 22 తేదీల్లో టెండర్లు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానంలో ఈ నెల 21, 22 తేదీల్లో పలు రకాల టెండర్లు, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ వి.హరిసూర్యప్రకాశ్ శనివారం తెలిపారు. 2024-25 వార్షిక సంవత్సరానికి సంబంధించి కొబ్బరి చెక్కలు, తలనీలాలు (ఏడాదికి), ప్రొవిజన్స్ (ప్రసాద దినుసులు, పచారి సరుకులు) 6 నెలలకు గాను ఈ నెల 21న ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ వేలం, టెండర్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 22న స్వామి వారి ఫొటోలు, వస్త్రాల సరఫరా చేసే హక్కు కోసం టెండర్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల వారు డిపాజిట్లు చెల్లించి పాల్గొనవచ్చని, వివరాలకు 8978914660, 9491000708 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఉపాధికి ఊతం

ఆలోచన ఉన్నతిం

- ఎస్సీ, ఎస్టీ మహిళలకు జీవనోపాధి
- ఉన్నతి పథకం ద్వారా సున్నా వడ్డీకే రుణాలు
- జిల్లాలో ఇప్పటికే 13 మందికి ఆటోల పంపిణీ
- ఆసక్తి గలవారు వినియోగించుకోవాలంటున్న అధికారులు



నరసన్నపేట:

మహిళా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. తాజాగా 'ఉన్నతి' పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ మహిళలకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా వడ్డీ లేని రుణాలు అందిస్తోంది. ఎలాంటి వడ్డీ భారం పడకుండా రుణాలు చెల్లిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో 30 మండలాల్లో అర్హత కలిగిన మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించి మొదటి విడతగా 13 మందికి రుణాలు మంజూరు చేసి ఆటోలు పంపిణీ చేసింది. ఈ పథకంతో ఆటోలు పొందిన స్వయంశక్తి సంఘాల ఎస్సీ, ఎస్టీ మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వడ్డీలేని రుణాలు..



మహిళల ఆదాయాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా వడ్డీ లేకుండా రుణాలు మంజూరు చేశారు. ఆటో కొనుగోలు చేసేందుకయ్యే ఖర్చులో లబ్ధిదారులు 10 శాతం మాత్రమే చెల్లిస్తున్నారు. మిగిలిన 90 శాతం రుణాన్ని సెర్ప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. ఈ రుణానికి ఎలాంటి వడ్డీ ఉండదు. మొత్తం రుణం 48 సులభ వాయిదాల్లో చెల్లించే సౌకర్యం కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న వారికి మాత్రమే రుణాలు ఇస్తున్నారు.

మొదటి విడతగా 13 మందికి..

జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు ఆహ్వానించగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 13 మందిని ఎంపిక చేశారు. ఈ మేరకు రుణాలు మంజూరు చేశారు. ఆటోలు కొనుగోలు చేసి పంపిణీ చేశారు. జిల్లాలో ఈ పథకాన్ని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఇటీవలే ప్రారంభించారు. పోలాకి, జలుమూరు మండలాల్లో ఆటో పొందిన లబ్ధిదారులు తమ ఆటోలను నడుపుతున్నారు. రెండో విడతగా ఆటోలు పంపిణీ చేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. ప్రతి మండలంలోనూ వీటిని పంపిణీ చేయాలనే ఆలోచనతో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



ఆటో రుణం పొందిన ఎస్సీ,ఎస్టీ మహిళలు

ఆటో ఇచ్చి ఆదుకున్నారు

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ మహిళలకు ఎంతో మేలు చేస్తున్నారు. చేయూత, ఆసరాతో పాటు అనేక పథకాలు మహిళలకు అందిస్తూ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నారు. ఇప్పుడు నాలాంటి పేద మహిళకు వడ్డీ లేని రుణంతో ఆటో ఇచ్చి ఆదుకున్నారు. ఇక కుటుంబ పోషణకు డోకా ఉండదు.

– ఇప్పిలి దుర్గ, జలుమూరు

కుటుంబానికి దన్నుగా..



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత పలు పథకాల ద్వారా ప్రయోజనం పొందాను. ఇప్పుడు ఈ విధంగా ఆటో కొనుగోలుకు రుణం ఇచ్చి ఆదుకున్నారు. చాలా ఆనందంగా ఉంది. నా కుటుంబాన్ని పోషించుకోగలననే ధైర్యం కలుగుతుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాను.

– కళింగపట్నం రవలి, బత్రి, సారవకోట మండలం

మహిళా సాధికారత..



మహిళలు స్వయం శక్తితో ఆర్థికాభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేపడుతోంది. తాజాగా ఎస్సీ,ఎస్టీ మహిళలకు అందిస్తున్న 'ఉన్నతి' పథకం మరింతగా మహిళా సాధికారతకు దోహదపడుతుంది. జిల్లాలో మొదటి విడతగా 13 మందికి రుణాలు ఇచ్చాం. ఇంకా అర్హులు ముందుకు వస్తే మంజూరు చేస్తాం.

– విద్యాసాగర్, పీడీ, డీఆర్‌డీఏ, శ్రీకాకుళం

సద్వినియెగం చేసుకుంటా..



'ఉన్నతి' పథకం నాలాంటి మహిళలకు ఎంతగానో ఉపకరిస్తుంది. సాధారణ ఎస్సీ కుటుంబాలు ఒక ఆటో కొనుగోలు చేయాలంటే ఎంతో కష్టం. అలాంటిది వడ్డీ లేకుండా ప్రభుత్వం సెర్ప్ సహకారంతో రుణం చెల్లించి ఆటోలు కొనుగోలు చేసి నాలాంటి కుటుంబాల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోంది. ప్రభుత్వ సహాయాన్ని మరిచిపోలేను.

– కె.రాణిపోలమ్మ, చీడివలస, పోలాకి మండలం

ప్రభుత్వ ప్రతిష్ట పెరిగేలా పనిచేయాలి



నియామక పత్రాలను అందజేస్తున్న చైర్‌పర్సన్ పిరియా విజయ

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను పెంచేలా అధికారులు పనిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వివిధ శాఖలఅధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. 1వ, 2వ, 4వ, 7వ స్థాయి సంఘ సమావేశాల్లో గృహ నిర్మాణశాఖ, సహకార శాఖ, జిల్లా నీటి యాజమాన్యశాఖ, పరిశ్రమల శాఖ, జిల్లా నీటి యాజమాన్య శాఖలతో సమీక్షించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. 4వ స్థాయి సంఘ సమావేశంలో విద్యా, వైద్య,ఆరోగ్య, ప్రొహిబిషన్, ఎస్ఈబీ జిల్లా అధికారులతో సమీక్షించారు. 7వ, 1వ స్థాయి సంఘ సమావేశంలో పంచాయతీరాజ్, తోటపల్లి బ్యారెజీ ప్రాజెక్టు, ఐఅండ్‌డీపీఏడీ ప్రత్యేక పరిశోధనా విభాగం, రహదారులు, భవనాలశాఖ, బీఆర్ఆర్ శంశధార ప్రాజెక్టు తదితర శాఖల అధికారులతో మాట్లాడి సూచనలందించారు. సమావేశంలో వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, సీఈవో ఆర్.వెంకట్రామన్, జెడ్పీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయంలో పదోన్నతి పొందిన ఉద్యోగులకు, మృతి చెందిన కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద నియామక ఉత్తర్వులు అందించారు.

ఆరంభ మ్యాచ్‌లోనే అదరగొట్టాడు



మ్యాచ్‌కు ముందు సుశాంత్‌కు క్యాప్ అందజేస్తున్న కోచ్

- 78 పరుగులతో రాణించిన నంబళ్ల సుశాంత్
- అంతర్‌రాష్ట్ర అండర్-19 క్రికెట్ టోర్నీ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్టార్ ఆల్‌రౌండర్ నంబళ్ల సుశాంత్ అండర్-19 క్రికెట్ టోర్నీలో తన ఆరంభమ్యాచ్‌లో అదరగొట్టాడు. ఆంధ్రా అండర్-19 బాలుర టెస్ట్(నాలుగు రోజుల మ్యాచ్‌లు) క్రికెట్ టోర్నీలో సుశాంత్‌ను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఎంపిక చేసిన విషయం తెలిసిందే. అనంతపురంలో ఈ నెల 15 నుంచి జార్ఖండ్‌తో తన 5వ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టులో చేరిన ఈ లెఫ్టహ్యాండ్ బ్యాటర్ తనను ఎంపిక చేసిన సెలక్టర్ల నమ్మకాన్ని నిలబెట్టాడు. కీలక మ్యాచ్‌లో వన్‌డౌన్ బ్యాటర్‌గా బరిలోకి దిగి 123 బంతుల్లో 9 బౌండ్రీలు, ఒక సిక్సర్ సాయంతో 78 పరుగులతో రాణించాడు. ఆంధ్రా జట్టు రెండోరోజు తన ఆటముగిసే సమయానికి 79 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 215 పరుగులు చేయగా.. సుశాంత్ సాధించిన 78 పరుగులే ఇన్నింగ్స్‌లో టాప్ స్కోర్ కావడం విశేషం. సుశాంత్ స్వస్థలం జిల్లాలోని టెక్కలి పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ. మిగిలిన మ్యాచుల్లో రాణించి జట్టును విజయపథంలో నిలపాలని తల్లిదండ్రులు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు ఆకాంక్షిస్తున్నారు.

విస్తృతంగా బ్యాంకు సేవలు



మాట్లాడుతున్న శుభనారాయణ ప్రసాద్

శ్రీకాకుళం రూరల్: వ్యవసాయ రంగానికి బ్యాంకులు పెద్దపీట వేస్తున్నాయని యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్ మేనేజర్ శుభనారాయణ ప్రసాద్ అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల (నైరా)లో రెండు రోజులుగా జరుగుతున్న ఆహార భద్రత, సుస్థిరమైన గ్రామీణ జీవనోపాధికి వ్యవసాయ ఆవిష్కరణల సదస్సు ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటలైజేషన్ వల్ల బ్యాంక్ సేవలు విస్తృతంగా పెరిగాయని, వినియోగదారులకు నిమిషాల వ్యవధిలో సేవలందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డి.శ్రీనివాస్, బోర్డు మెంబర్ పి.గురుమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉమామహేశ్వరావు పాల్గొన్నారు.

దుబాయ్‌లో కేసరపడ వాసి మృతి

- పట్టించుకోని కంపెనీ ప్రతినిధులు
- మృతదేహం తరలింపునకు సాయిరాజ్ ప్రయత్నం



ధర్మారావు (ఫైల్)



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పిరియా సాయిరాజ్

కంచిలి: మండలంలోని కేసరపడ గ్రామానికి చెందిన మల్లార్పు ధర్మారావు(38) దుబాయ్‌లో మిషన్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో అనుమానాస్పద స్థితిలో ఉరికి వేలాడుతూ కనిపించగా.. తోటి పనివారు కుటుంబ సభ్యులకు శుక్రవారం సమాచారం అందించారు. అక్కడ ఓ గదిలో ధర్మారావుతోపాటు మరో ముగ్గురు బీహారీలు ఉంటున్నారు. ధర్మారావు మృతితో ఆ ముగ్గుర్నీ అక్కడి పోలీసులు అరెస్టు చేసినట్లు చెబుతున్నారు. పూర్తివివరాలు తెలియక కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ధర్మారావుకు భార్య తులసి, ఆరో తరగతి చదువుతున్న కుమార్తె ఝాన్సీ ఉన్నారు. విషయాన్ని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ దృష్టికి రావడంతో శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం సీఎంఓ అధికారులతో మాట్లాడారు. కలెక్టర్, జిల్లా ఎస్పీలతో కూడా మాట్లాడి మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించి, వారి కుటుంబసభ్యులకు అప్పగించాలని కోరారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, ఆర్‌బీకే అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, కప్పల యుగంధర్ పాల్గొన్నారు.

● అభిమాన నేతకు అభిషేకం



మాట తప్పని నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. శనివారం సుభలయిలో వంశధార నిర్వాసితులతో కలిసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారం కింద రూ.216.71కోట్లు జమచేశారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎ.వి. సురేష్, వాకాడ నర్సింహారెడ్డి, ఎర్ర భాస్కరరావు, కాలమ్ మూర్తి, వాణీ, పార్వతి, ఆరుద్ర, స్వాతి పాల్గొన్నారు. –హిరమండలం

● ఎస్పీకి పురస్కారం

జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక శనివారం రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) కె.వి. రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా డీజీపీ డిస్క్ అవార్డు అందుకున్నారు. శనివారం మంగళగిరిలోని ప్రధాన పోలీసు కార్యాలయంలో ఈ అవార్డు ప్రదానం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, దిశ స్ఫూర్తితో నిందితులకు శిక్ష విధించడంలో చేసిన కృషికి ఈ అవార్డు దక్కింది. –శ్రీకాకుళం క్రైమ్



● క్రిస్మస్ సంబరం



శ్రీకాకుళం నగరంలోని గూనపాలెం మేదరవీధిలో లిటిల్ ఫ్లాక్ ప్రేయర్ హోమ్ ఆధ్వర్యంలో యూత్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్ పి.ఐజాక్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాల్లో మచిలీపట్నానికి చెందిన రెవరెండ్ యేనా బాబు క్రీస్తు సందేశం వినిపించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. – శ్రీకాకుళం కల్చరల్

క్లుప్తంగా

కోటేశ్వరుడి హుండీ ఆదాయం రూ.1.53 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని గుడి వీధి ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయంలో హుండీ కానుకల ద్వారా రూ.1,53,318 ఆదాయం వచ్చిందని ఈఓ మునగవల సుకన్య తెలిపారు. శనివారం దేవదాయశాఖ పర్యవేక్షణాధికారి జి.వి.బి.ఎస్.రవికుమార్, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు, ప్రధాన అర్చకులు, స్థానిక పెద్దలు, భక్తుల సమక్షంలో ఆలయ హుండీలను తెరిచి లెక్కించారు. 289 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, ట్రస్టు సభ్యులు పూసర్ల శ్రీదేవి, నల్లపిల్లి యమున, పూసర్ల నగేష్, జూనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, అటెండర్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉర్లాంలో గడ్డి వాములు దగ్ధం



కాలిపోతున్న గడ్డికుప్పలు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాంలో ఇద్దరు పాడిరైతులు పోతాబత్తుల ఎర్రన్న, కోల తవుడులకు చెందిన గడ్డి వాములు దగ్ధమయ్యాయి. శనివారం ఉదయం ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి స్థానికుల సహకారంతో మంటలను అదుపులోనికి తీసుకువచ్చారు. అప్పటికే గడ్డి వాములు పూర్తిగా కాలిపోయాయి. ఏడాదికి సరిపడా గడ్డిని కొనుగోలు చేసి నిల్వ చేశామని, రూ. 50 వేల వరకూ నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



కల్పన మృతదేహం

జలుమూరు: మండలంలోని టి.లింగాలపాడుకు చెందిన చల్ల కల్పన(23) శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్పన రెండేళ్లుగా మానసిక సమస్యతో బాధపడుతుండటంతో చికిత్స కూడా ఇప్పిస్తున్నారు. అయినా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో ఇంటికి భారంగా ఉన్నానని భావించి ఆత్మహత్యకు పాల్పడింది. కల్పనకు భర్త భుజంగరావు, కుమార్తె జస్మిత, కుమారుడు మోక్షిత్ ఉన్నారు. కల్పన తల్లి చిన్నమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు.

ధనుర్మాస ఉత్సవాలకు సన్నద్ధం

- నేటి నుంచి వైష్ణవాలయాలలో తిరుప్పావై ప్రవచనాలు
- 23న వైకుంఠ ద్వార దర్శనాలు, గీతాజయంతి
- నెలరోజులపాటు కొనసాగనున్న ఉత్సవాలు



గోదాదేవి అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: వేదాల్లో సామవేదం.. మాసాల్లో మార్గశిరం అత్యంత పవిత్రమైనవని భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు చెబుతాడు. ఈ నెలలో రంగనాథున్ని భక్తితో సేవించి గోదాదేవి తన భక్తిని చాటుకుంది. సూర్యుడు వృశ్చికరాశి నుంచి ధనూరాశిలోకి ఈ నెలలోనే ప్రవేశిస్తాడు. ఈ 30 రోజుల కాలాన్ని ధనుర్మాసంగా పిలుస్తూ విష్ణువును ప్రసన్నం చేసుకునేందుకు గోదామాత రోజుకో రీతిగా 'తిరుప్పావై' పాశురాలను ఆలపిస్తుంది. అందరూ ఆచరించే భగవద్గీత పుట్టింది కూడా ఈ నెలలోనే. ధనుర్మాసానికి ప్రతీకగా వైష్ణవ స్వాములు పుల్లగుమ్మిడి కాయకు గంటు పెట్టడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. దీనినే నెలగంటు పెట్టడంగా భావిస్తారు. పట్టణంలో హరిదాసుల సందడి ప్రారంభమై ఇంటి ముందు ముగ్గులతో శోభాయమానంగా ఉంటుంది.

తిరుప్పావై ప్రవచనాలు ప్రత్యేకం..

శ్రీవైష్ణవులకు తిరుప్పావై వ్రతం ముఖ్యమైంది. నెల రోజులు రొజుకొక పాశురం చొప్పున విన్నపం చేస్తారు. 1 నుంచి 5 పాశురాలలో వ్రతవిధానం, 6 నుంచి 15 పాశురాలలో తనతోటి చెలికత్తెలను నిద్ర లేపి నందగోపుని గృహానికి వెళ్లడం, 16, 17, 18 పాశురాలలో నందగోపుడు, యశోద, బలరాములను మేల్కొల్పడం, 23వ పాశురంలో మంగళాశాసనం, 25, 26 పాశురాలలో స్వామికి అలంకారాలైన ఆయుధాలను పరా అనే వాయిద్యాన్ని తమ శరణాగతి అనుగ్రహించి సంకల్పాన్ని నెరవేర్చమని ప్రార్థించడం ఈ ప్రవచనాల ప్రత్యేకత.

నగర పరిధిలో..

శ్రీకాకుళం నగర పరిధిలోని నారాయణతిరుమల వేంకటేశ్వరాలయం, చిన్నబజారు, పాతశ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయాలు, దీపామహల్ వెనుక ఉన్న శివబాలాజీ ఆలయం, పాలకొండ రోడ్డులోని కోదండరామాలయం, పాండ్రంగివీధిలోని రామమందిరం, చిన్నబజారులోని దూదివారి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలు జరగనున్నాయి.



కొత్తూరులో హరేరామ నగరసంకీర్తన చేస్తున్న భజన బృందం

43 ఏళ్లుగా నగర సంకీర్తన

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులో నిర్వహిస్తున్న హరేరామ నగర సంకీర్తనకు 43 ఏళ్లు పూర్తయ్యాయి. 1980లో కొత్తూరుకు చెందిన వైశ్యరాజు శ్రీరామరాజుతో పాటు పలువురు భక్తులు హరేరామ నగర సంకీర్తన ప్రారంభించారు. ఆయన మృతి చెందాక లోతుగెడ్డ భగవాన్ దాసునాయుడు ఆధ్వర్యంలో నగర సంకీర్తన కొనసాగుతోంది. ప్రతిరోజూ తెల్లవారుజాము 4.30 గంటలకు స్థానిక శ్రీసీతారామ మందిరం నుంచి ప్రారంభమై రెండు నుంచి మూడు వీధుల్లో నగరసంకీర్తన చేస్తారు. ఇలా ఏడాది పొడవునా భక్తి గీతాలు ఆలపిస్తారు. మందిర ప్రధాన అర్చకులు లక్ష్మణ పాణిగ్రాహి హారతి ఇచ్చి ముగింపు చేస్తారు. తిత్లీ తుఫాన్, కరోనా వంటి విపత్తుల సమయంలోనూ హరే రామ సంకీర్తన చేయడం విశేషం.

సమాజ చైతన్యానికి రచయితల కృషి అభినందనీయం



పుస్తకావిష్కరణ చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు తదితరులు

శ్రీకాకుళం కల్చరల్: సమాజంలో చైతన్యం తీసుకొచ్చేందుకు రచయితల కృషి అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో శనివారం శ్రీకాకుళ సాహితి, ధర్మాన చారిటబుల్ ట్రస్టు, కళింగాంధ్రా సాంస్కృతిక వేదికల ఆధ్వర్యంలో కళింగాంధ్రా సాహిత్య సమాలోచన, వైఎస్ఆర్ జీవన సాఫల్య పురస్కార గ్రహీతల సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాహిత్యం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఉంటుందని, దాన్ని పరిగణనలోకి తీసుకొని పాలకులు పాలన సాగించాలనేది తన అభిప్రాయమన్నారు. ప్రభుత్వం తరఫున నిర్ణయాలు తీసుకునే సమయంలో తమకు ఇలాంటి వారి సలహాలు, సంప్రదింపులు, రచనలు, ప్రసంగాలు ఎంతో ఉపకరిస్తాయని చెప్పారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ చైతన్య శక్తుల సమీకరణ జరిగితే కళింగాంధ్రా అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఉత్తరాంధ్ర, తెలంగాణా ప్రాంతంలో మంచి సాహిత్యం రావడానికి కారణం బాధిత, పీడిత ప్రజల సమస్యలేనని చెప్పారు. సాహిత్యాన్ని, చైతన్యాన్ని సమన్వయం చేస్తే అభివృద్ధి తప్పక సాధ్యమవుతుందన్నారు. ప్రముఖ విమర్శకులు డాక్టర్ జి.లక్ష్మీనరసయ్య, రచయిత్రి ఈమని రాణిశర్మ, సభాధ్యక్షులు నల్లి ధర్మారావు ప్రసంగించారు. అనంతరం శ్రీకాకుళ సాహితీ ఆధ్వర్యంలో వెలువడిన 'రామారావునాయుడు రచనలు' పుస్తకాన్ని మంత్రి ధర్మాన ఆవిష్కరించగా.. కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు సభకు పరిచయం చేశారు. కార్యక్రమంలో గురుగుబెల్లి లోకనాథం, దీర్ఘాసి విజయభాస్కర్, కళింగ కార్పొరేషన్ అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, డాక్టర్ నిక్కు అప్పన్న, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఉద్యోగుల సంఘ నాయకులు చౌదరి పురుషోత్తం నాయుడు, హనుమంతు సాయిరాం, కోణార్క్ శ్రీను, ఈఈ పాగిరి సుగుణాకరరావు, పొట్నూరు వెంకటరావు, రచయితలు కె.ఎన్.మల్లీశ్వరి, అయ్యంగారు సీతారత్నం, గంటేడ గౌరు నాయుడు, డాక్టర్ కె.ఉదయ్ కిరణ్, దాసరి రామచంద్రరావు, పాదిలాపు శ్రీనివాస్, శిరంశెట్టి కాంతారావు, దుప్పల రవికుమార్, చీకటి దివాకర్, చింతాడ తిరుమలరావు, నెట్టెం రమణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అఖండ నామసంకీర్తన



నరసన్నపేటలోని ఒరియా కంద్ర కుల సంఘం ఆధ్వర్యంలో హరేరామ, హరే కృష్ణ అఖండనామ సంకీర్తన మహాయజ్ఞం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం స్థానిక జట్టు కళాశీ సంఘ భవనం వద్ద ప్రారంభమైన సంకీర్తన మహా యజ్ఞం శనివారంతో ముగిసింది. అనంతరం ఊరేగింపుగా వెళ్లిన భక్తులు సత్యవరం కూడలిలోని చెరువులో రాధాకృష్ణుల విగ్రహాలను నిమజ్జనం చేశారు. బృందావనం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టగా కంద్ర కుల సంఘం ప్రతినిధులు శిల్పి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. - నరసన్నపేట

చేనేత పరిశ్రమ అభివృద్ధికి సంపూర్ణ సహకారం



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: పొందూరు ఖాదీ భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నమని, ఇక్కడ చేనేత పరిశ్రమ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పొందూరు ఏఎఫ్‌కేకే సంఘంలో వైఎస్సార్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ పథకంలో భాగంగా నిర్మించిన ఖాదీ భవన సముదాయాన్ని స్పీకర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పొందూరు ఖాదీపై ఉన్న మక్కువతో వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపిక చేసి సంస్థకు రూ.10 లక్షలు అందజేయగా భవనం నిర్మించారని చెప్పారు. ఇప్పటికే నేతన్న నేస్తం కింద చేనేత కార్మికులకు ఏడాదికి రూ. 24 వేలు అందజేస్తూ చేదోడు వాదోడుగా నిలుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, నాయకులు కిల్లి నాగేశ్వరరావు, పొందూరు పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు జైప్రతాప్‌కుమార్, నాయకులు వండాన వెంకటరావు, కూర రమణమ్మ, కిల్లాన సూర్యారావు, వడగ పద్మావతి, ఏఎఫ్‌కేకే సంఘం అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి దండా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు రాఘవేంద్ర



రాఘవేంద్రను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రణస్థలం : జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలకు కోటపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి వి.రాఘవేంద్ర ఎంపికయ్యాడు. ఈ నెల 10 నుంచి 12 వరకు నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. దీంతో జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడు. విద్యార్థిని హెచ్ఎం వై.రామం, వ్యాయామ ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు.

దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం



మాట్లాడుతున్న బీసీ సంఘాల ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్దానంలో దశాబ్దాల నాటి కిడ్నీ సమస్యకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత పరిష్కారం చూపారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టా చంద్రపతిరావు, రాష్ట్ర కార్యదర్శి బీన ఢిల్లీ రావు, ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు కొనియాడారు. శనివారం శ్రీకాకుళంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కిడ్నీ పరిశోధన కేంద్రం, తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో సీఎం జగన్ పేరు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అదేవిధంగా, థర్మల్ విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా పోరాడిన వారిపై కేసులను మానవతా దృక్పథంతో ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు కొంచాడ నెహ్రూ, తామాడ గణపతి పాల్గొన్నారు.


జాతీయస్థాయి పోటీలకు నగరంపల్లి విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎం.కృపసింధు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల గుంటూరులోని నర్సారావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్ అథ్లెటిక్స్ మీట్‌లో ప్రతిభ కనబర్చి పట్నాలో జరగనున్న పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థిని శనివారం ఉపాధ్యాయులు అభినందించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రమణమ్మ రూ.2 వేలు అందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సూర్యనారాయణ, చంద్రశేఖర్, కె.ప్రసాద్, మోహన్‌రావు, కేశవ, కృష్ణారావు, కాళిదాసు, యర్రన్న, బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సలహా మండలి చైర్మన్ నేతాజీ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రైతులు అధిక మోతాదులో ఎరువులు వాడితే పంటలు నాశనమయ్యే ప్రమాదముందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎస్.వి.ఎస్.ఆర్.కె.నేతాజీ అన్నారు. రైతులు పురుగుమందులు, ఎరువుల కోసం డీలర్లనే సంప్రదిస్తారని, వారు వ్యాపారం కోసం అవసరానికి మించి వాడేలా సూచించడంతో నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళంలోని జిల్లా వనరుల కేంద్రంలో వ్యవసాయ విస్తరణ సేవలకు సంబంధించి ఉత్పాదక వర్తకులకు సేవా యోగ్యత శిక్షణ 5వ బ్యాచ్ ప్రారంభ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగోలు వరి పరిశోధన అధిపతి డాక్టర్ పి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ శిక్షణ సద్వినియోగం చేసుకుని పొలాల్లో పంటలను నేరుగా పరిశీలించి తగిన రసాయనాలు వినియోగించుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ మాట్లాడుతూ పంట తొలి దశలోనే ఎక్కువ విషపూరిత రసాయనాలు వాడకుండా గ్రీన్‌లేబుల్ పురుగు మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు ఎ.కె.కృష్ణారావు, ఆత్మ పీడీ ఎ.రామచంద్రరావు, బి.సునీత, మౌనిక, పి.బాలకృష్ణ, డీపీఎం రేవతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: జిల్లాలో గత పాతికేళ్లలో జరిగిన అభివృద్ధి టీడీపీ నాయకులు కూన రవికుమార్ బహిరంగ చర్చకు సిద్ధమా అని వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ సవాల్ చేశారు. ఆమదాలవలసలోని జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఉద్దాన ప్రజలకు చేసిన మంచిని చూడలేని టీడీపీ నాయకులు లేనిపోని మాటలు మాట్లాడటం తగదన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో శ్రీకాకుళం జిల్లాకు చేసింది శూన్యమన్నారు. బాబు హయాంలో జరిగిన ఒక్క ప్రాజెక్టునైనా టీడీపీ నాయకులు చూపించగలరా అని ప్రశ్నించారు.నారాయణపురం, మడ్డువలస, వంశధార ప్రాజెక్టు, రిమ్స్ మెడికల్ కాలేజీ, మూలపేట పోర్టు,, మహేంద్ర తనయ ప్రాజెక్టు, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ తదితర వాటిల్లో జిల్లాకు టీడీపీ నాయకుల పాత్ర ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. ఇంకా సిగ్గు లేకుండా కూన రవికుమార్ జగనన్నపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. ఈ విషయాలపై చర్చించటానికి తేదీలను ప్రకటించాలని కూన రవికుమార్‌కు సవాల్ విసిరారు. సమావేశంలో పార్టీ కార్యకర్తలు దానేటి రామ్మోహన్, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, సువ్వారి మనోహర్ పాల్గొన్నారు.

రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో, ఏపీఎంఎఫ్, ఏపీకాస్ట్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: గణితంతో ముడిపడిన లెక్కలతో మానవాళి దైనందిన జీవనం ముడిపడి ఉందని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. గణిత మేధావి, శాస్త్రవేత్తగా చరిత్రపుటల్లో కీర్తిగడించిన శ్రీనివాస రామానుజన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. గణితశాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ మేథమేటిక్స్ ఫోరం, ఏపీకాస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన గణిత పోటీ పరీక్షల్లో విజేతలగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితంలో రాణించేవారు జీవితంలో ఉన్నతస్థాయిలో నిలుస్తారన్నారు. ప్రఖ్యాత గణిత అవధాని టీవీఎస్‌వీ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీఎంఎఫ్ గంగలపూడి భాస్కరరెడ్డి, డీవైఈఓ డాక్టర్ తిరుమలచైతన్య, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, కేవీఎస్ ప్రసాద్, ఏపీకాస్ట్ రాష్ట్రపరిశీలకులు జె.ఢిల్లేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి ఎస్.కుమారస్వామి, సిక్కోలు గణిత వేదిక ప్రతినిధులు, గణిత ఉపాధ్యాయులు, బాలబాలికలు పాల్గొన్నారు.